క్లుప్తంగా...

రేపటి పీజీ పరీక్షలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో ఈ నెల 4న జరిగే వివిధ పీజీ కోర్సుల 3వ సెమిస్టర్ పరీక్షను 13వ తేదీకి వాయిదా వేసినట్లు కంట్రోలర్ ప్రొ.రాములు శనివారం తెలిపారు. రెగ్యులర్ కోర్సులతో పాటు పీజీ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ మొదటి సెమిస్టర్ పరీక్షలు కూడా వాయిదా వేశారు. పరీక్ష సమయం, పరీక్ష కేంద్రాలలో ఎలాంటి మార్పులేదన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.15, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 23, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 31, పచ్చకాకర 20, పందిరి బీర 18, క్యాబేజీ 11, క్యారెట్ 35, దొండ 23, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 45, గోకరకాయ 28, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 29, ఆలుగడ్డ 21, చామగడ్డ 32, మొరంగడ్డ 30, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 4–6.

బొడ్రాయికి పూజలు, క్షీరాభిషేకం



బొడ్రాయికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలో శీతలదేవి(బొడ్రాయి)జీర్ణోద్ధరణ పూర్వక పునఃప్రతిష్ట మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం వేద పండితుల సారథ్యంలో స్థాపిత దేవతా పూజలు, నవగ్రహ మాతృకా యోగిని వాస్తు క్షేత్ర పాలక బ్రహ్మాది మండల దేవతా హవనములు, అనంతరం బొడ్రాయికి క్షీరాభిషేకం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బొడ్రాయిని దర్శించుకుని పాలుపోసి పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

సంక్షేమ పథకాలు క్రైస్తవులకూ అందేలా చూడాలి



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న క్రైస్తవ ప్రముఖులు

రాంగోపాల్‌పేట్: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి క్రైస్తవుడికి చేరేలా క్రైస్తవ పెద్దలు చూడాలని పలువురు సూచించారు. శనివారం సికింద్రాబాద్ హరిహరకళాభవన్‌లో బిషప్ ముల్కల భాస్కర్ ఆధ్వర్యంలో క్రైస్తవ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య సలహాదారులు బిషప్ విల్సన్ సింగం, అజరయ్య సాల్మన్ పలువురు బిషప్‌లు, పాస్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల క్రైస్తవ మైనార్టీలకు అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టినప్పటికీ వారిలో అవగాహన లేకపోవడంతో వారి వద్దకు చేరడం లేదన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ క్రైస్తవులకు అండగా ఉన్నారని రాష్ట్ర సచివాలయంలో చర్చిని నిర్మించారని అందుకే క్రైస్తవులు బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలవాలన్నారు. రాజ్యాంగ, నామినేటెడ్ పదవుల్లో క్రైస్తవులకు సరియైన వాటా దక్కాలని, రాజ్యాధికార హక్కులకు పోరాడాలని సూచించారు.

కళాశాలలో కెరీర్ అండ్ మోటివేషన్ ప్రోగ్రాం



సికింద్రాబాద్: సీతాఫల్‌మండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ధనశరణ్య ఎన్‌జీఓ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ అండ్ మోటివేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ చైర్మన్ చింత సాయిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ జాయింట్ ఐజీ అంబేడ్కర్, ఎస్సీ కార్పొరేషన్ రిటైర్డ్ ఈడీ సర్వయ్య, సాఫ్ట్‌వేర్ నిపుణుడు ఎస్.సురేష్‌కుమార్ హాజరై విద్యార్థులు ఉన్నత విద్య, ఉన్నత శిఖరాలు అధిరోహించడం కోసం మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.కవిత, అధ్యాపకులు రేణుకాబాయి, పద్మావతి, అరుణ, బాలరాజు, ప్రశాంతి, చెన్నయ్య పాల్గొన్నారు.

జోహార్..వైఎస్సార్

మహా నేతకు ఘన నివాళి



వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాగులూరి సాయిబాబా

చిలకలగూడ: సంక్షేమం, అభివృద్ధికి మానవీయతను జోడించి ప్రజల దేవుడిగా పూజింపబడుతున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడుకలను చిలకలగూడలో శనివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ లీడర్ నాగులూరి సాయిబాబా ముఖ్యఅతిథిగా హాజరై వైఎస్ఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరణం లేని మహామనిషిగా వైఎస్ఆర్‌ను అభివర్ణించారు. పెద్దాయన భౌతికంగా మనమధ్య లేకున్నా తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో భారతి, బాలామణి, ఆనంద్, రామ్‌లాల్, దేవుడువెంకట్, అంజి, మనోహర్‌బాబు, బాబా, ఆంజనేయులు, సతీష్‌కుమార్, ప్రమోద్, రవిశంకర్ పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో..

కంటోన్మెంట్: పేదల పక్షపాతి దివంగత నేత వైఎస్సార్‌ను నిరుపేదలు మరువలేరని కాంగ్రెస్ సీనియర్ నేత డీబీ దేవేందర్ అన్నారు. వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని పికెట్‌లోని తన కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. వైఎస్సార్ చలవ వల్లే కంటోన్మెంట్‌లో మహిళా సంఘాలు ఏర్పడ్డాయన్నారు. నేడు కంటోన్మెంట్‌లో 20 వేల మందికి పైగా మహిళలకు కోట్లాది రూపాయల రుణాలు అందుతున్నాయన్నారు. పేదల సంక్షేమం కోసం ఆయన అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కంటోన్మెంట్ దాహార్తిని తీర్చడంతో పాటు పలు సమస్యల పరిష్కారంలో వైఎస్ చొరవ చూపారని కొనియాడారు.



మహిళలకు పండ్లు పంచిపెడుతున్న దాసరి మణిరత్నం

- జన హృదయ నేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌ను పేదలు ఎన్నటికీ మరువలేరని వైఎస్సార్ వీరాభిమాని దాసరి మణిరత్నం అన్నారు. వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా బోయిన్‌పల్లి మార్కెట్ పరిసరాల్లో మహిళలకు పండ్లు పంపిణీ చేశారు.

విద్యార్థులకు పండ్ల పంపిణీ..



విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

రాంగోపాల్‌పేట్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా హిల్‌స్ట్రీట్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ హాజరై మాట్లాడారు. వైఎస్ రాజశేఖరరెడ్డి పేద ప్రజలు, రైతులు, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచి వారి సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారని కొనియాడారు. ఆరోగ్యశ్రీ లాంటి విప్లవాత్మక పథకాన్ని ప్రవేశపెట్టి ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పేద ప్రజలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకునేలా చేశారని గుర్తు చేశారు. ఆయన నేడు మన మధ్యలో లేకపోయినా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు అల్లాడి గౌరిశంకర్, నందికంటి రవి, ఆరోగ్యం, జూడ్‌పాల్, నాగేష్, సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.



రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న డాక్టర్ రవీందర్‌గౌడ్



ఆశ్రయ్ ఆకృతిలో అల్పాహార వితరణ

రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో..

సనత్‌నగర్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా డాక్టర్ రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు ప్రజానీకానికి ఎనలేని సేవలు అందించిన వైఎస్సార్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ప్రజా సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు అమలు పరిచి ప్రజల గుండెల్లో చోటు సంపాదించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, కమల్‌రాజ్, షాబాద్ సత్యనారాయణ, తోట మణిమాల పాల్గొన్నారు.

అల్పాహార వితరణ..

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, తన తండ్రి లేబాకు నారాయణరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని లేబాకు నారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఎస్ఆర్‌నగర్‌లోని ఆశ్రయ్ ఆకృతి విద్యార్థులకు అల్పాహార వితరణ చేశారు. ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అభ్యాసక సహాయ సేవా విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి విద్యార్థులతో కలిసి సహపంక్తి అల్పాహారాన్ని స్వీకరించారు.

5న అదనపు గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన



పాఠశాలను సందర్శించిన విద్యాశాఖ అధికారులు, నాయకులు

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్ క్రిష్ణానగర్ మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు అదనపు గదుల నిర్మాణానికి రూ. 2.17కోట్లు మంజూరయ్యాయి. ఈ పాఠశాలలో సుమారు 750 మంది విద్యను అభ్యసిస్తున్నారు. పెరిగిన విద్యార్థులకు సంఖ్యకు తరగతి గదులు సరిపోకపోవడంతో ఉన్నత పాఠశాల సాధన సమితి ప్రతినిధులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విన్నవించారు. స్పందించిన మంత్రి విద్యాశాఖ ఉన్నతాధికారులు లేఖరాసి నిధులు మంజూరు చేయించారు. శనివారం సాయంత్రం పాఠశాలను డిప్యూటీ డీఈఓ చిరంజీవి, టీఎస్‌ఈడబ్ల్యూడీసీ డిప్యూటీ ఈఈ సంజీవ్, ఏఈ వెంకట్, ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్‌రెడ్డి, పద్మారావునగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జీ పవన్‌కుమార్ గౌడ్, నాయకులు ఏసూరి మహేష్, వెంకటేశన్, బాబు, వెంకటరమణ, నాగలక్ష్మీ, ముక్కా శ్రీనివాస్, మహేందర్‌గౌడ్ శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ నెల 5 స్థానిక ఎమ్మెల్యే, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ శంకుస్థాపన చేస్తారని పవన్‌కుమార్ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్‌రెడ్డి పేర్కొన్నారు. రూ. 84 లక్షలతో నిర్మించే అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపనతో పాటు రూ. 32లక్షలతో నిర్మించిన అదనపు గదులను ప్రారంభిస్తారన్నారు.

పాలియేటివ్ సేవలను వినియోగించుకోవాలి

రాంగోపాల్‌పేట్: తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లాలో నిర్వహిస్తున్న పాలియేటివ్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటి ఓ ప్రకటనలో కోరారు. ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిలో 6, గడ్డిఅన్నారం రెడ్‌క్రాస్ ఆస్పత్రి వెనక 6 బెడ్లతో రెండు పాలియేటివ్ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుచూ జీవిత చరమాంకంలో ఉన్నవారికి సరైన సేవలను అందించి వారికి స్వాంతన చేకూర్చాలనే ఉద్దేశ్యంతో ఈ కేంద్రాల ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కేంద్రాల్లో డాక్టర్లు, ఫిజియో థెరపిస్టులు, స్టాఫ్ నర్సులు, ఆయాలు, రోగ గ్రస్థులకు 356 రోజులు సేవలు అందించేలా ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. రోగులతో పాటు వారి సహాయకులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలు అందిస్తారన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: జేమ్స్ స్ట్రీట్–సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం వెలుగు చూసింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. సుమారు 40 ఏళ్ల ఉన్న వ్యక్తి రైలు పట్టాల వెంట నడుచుకుంటూ వెళుతుండగా వేగంగా వచ్చిన రైలు ఢీ కొట్టడంతో మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు.

అప్పుల ఒత్తిడితో దంపతుల అదృశ్యం



శరత్‌కుమార్, ధనలక్ష్మీ

సనత్‌నగర్: భార్యాభర్తలు అదృశ్యమైన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ జయచందర్ వివరాల ప్రకారం.. హబ్సిగూడకు చెందిన వీవీఎస్‌డీ ధనలక్ష్మీ (30)కి రాంబాల శరత్‌కుమార్ (32)తో 2020లో వివాహం జరిగింది. దంపతులిద్దరూ ఆరు నెలల పాటు మండపేటలో ఉన్నారు. అయితే శరత్‌కుమార్ జూదం అలవాటు ఉండడంతో చాలామంది వద్ద అప్పులు చేశాడు. అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి అధికమవడంతో నగరానికి వచ్చి బేగంపేట ఇండియన్ ఎయిర్‌లైన్స్ కాలనీలో ఉంటున్నారు. హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించిన అప్పిచ్చిన వారు ఇక్కడికొచ్చి డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారు. గత నెల 23న ధనలక్ష్మీ సోదరుడు వీరసాయి ప్రకాష్ తన సోదరికి ఫోన్ చేయగా స్పందన రాలేదు. అనుమానం వచ్చి ఎయిర్‌లైన్స్‌కాలనీలోని సోదరి ఇంటికి వెళ్లి చూడగా తాళాలు వేసి ఉండడాన్ని గమనించి ఇంటి యజమానిని అడిగాడు. శరత్‌కుమార్ కోసం రోజూ చాలామంది ఇంటికి వచ్చి తమను ఇబ్బంది పెడుతున్నారని ఇంటి యజమాని తెలపడంతో పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాఖీ కట్టేందుకు వెళ్లిన బాలిక..

అడ్డగుట్ట: సోదరుడికి రాఖీ కట్టి తిరిగొస్తున్న బాలిక అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం. మియాపూర్‌కు చెందిన ఓ బాలిక (16) మారేడుపల్లిలో ఉంటూ పాలిటెక్నిక్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. గురువారం రాఖీ పండుగ సందర్భంగా మియాపూర్‌లోని తన ఇంటికి వెళ్లి సోదరుడికి రాఖీ కట్టి తిరిగి హాస్టల్‌కు బయలుదేరింది. మరుసటి రోజు శిరీషకు తన కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో హాస్టల్ వద్దకు వచ్చి ఆరా తీయగా ఫలితం లేకపోయింది. శనివారం బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పర్మనెంట్ చేయకుంటే ఆందోళనలు చేపడతాం

రేపటి నుంచి కాంట్రాక్టు అధ్యాపకుల పెన్‌డౌన్



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని 12 వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులు రేపటి నుంచి (4న) ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆందోళనలు విజయవంతం కోసం రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం టీఎస్–వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ నాయకులు డాక్టర్ ధర్మతేజ మాట్లాడుతూ.. పర్మనెంట్ కోసం నాలుగు నెలలుగా పోరాడుతున్న సీఎం పట్టించుకోవడం లేదని, కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యను వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో ప్రత్యక్ష ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అందులో భాగంగా రేపటి నుంచి పెన్‌డౌన్, చాక్ డౌన్‌తో విధులను బహిష్కరించి నిరసనలు చేపడుతూ తరగతులకు వెళ్లకుండా చెట్లకింద బైఠాయిస్తామన్నారు. ఉన్నత విద్యను అభ్యసించి అన్ని అర్హతలతో ఏళ్ల తరబడి బోధిస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు పర్మనెంట్ ఉద్యోగాలకు పనికిరామా అంటూ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రామేశ్వర్‌రావు, వెంకటేశం, ఉపేందర్, విజయేందర్‌రెడ్డి, కృష్ణయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి



కరపత్రాన్ని విడుదల చేస్తున్న వికాస్ మంచ్ సభ్యులు

కంటోన్మెంట్: కంటోన్మెంట్ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని కంటోన్మెంట వికాస్ మంచ్ (సీవీఎం) సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం 18 డిమాండ్‌లతో కూడిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వికాస్ మంచ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గద్దం ఏబెల్, సంకి రవీందర్ మాట్లాడుతూ.. త్వరలోనే కంటోన్మెంట్ ప్రాంతంలో జీహెచ్ఎంసీలో విలీనం కానుందన్నారు. అయితే విలీనానికి ముందే ఈ ప్రాంత అభివృద్ధికి రూ.25వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలన్నారు. కంటోన్మెంట్‌లోని ప్రభుత్వ స్థలాల్లో దశాబ్దాలుగా నివసిస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలు, యాజమాన్య హక్కులు కల్పించాలన్నారు. ఈ ప్రాంతంలో ఎస్ఎన్‌డీపీ, ఎస్ఆర్‌డీపీ, మెట్రోలైల్ వంటి ప్రాజెక్టులను చేపట్టడంతో మౌలిక వసతులను మెరుగుపర్చాలన్నారు. ఈ మేరకు రూపొందించిన కరపత్రాన్ని ఇంటింటికీ చేరవేసి ప్రజలందరి మద్దతు కూడగడతామన్నారు. అనంతరం వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవీందర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ ఫసీ, ఎలకంటి ప్రభుగుప్తా, అంబాల శ్రీనివాస్, అరుణ్ యాదవ్, ఆర్టీసీ మధు, మురళి యాదవ్, నర్సింగ్ రావు, దామోదర్, గిరి, కొండలరావు, నరేష్, మహమ్మద్ సలీం, గొల్లపల్లి అరుణ్ కుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సొంతింటికి తరలివెళ్లిన లబ్ధిదారులు



లాలాపేట నుంచి తరలివెళ్తున్న లబ్ధిదారులు

లాలాపేట: దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ పేద ప్రజలకు ఆత్మగౌరవం కల్పించేలా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్రూమ్‌ల పంపిణీతో పేద ప్రజల సొంతింటి కల నెరవేరిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సీహెచ్ సునీల్ ముదిరాజ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజక వర్గంలో తొలివిడతగా ఎంపికైన 500 మంది లబ్ధిదారులు శనివారం లాలాపేటలోని ప్రొ. జయశంకర్ స్టేడియం నుంచి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సుల్లో అహ్మద్‌గూడకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో అర్హులైన ప్రతి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం విడతల వారీగా ఇళ్లు కేటాయిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు, వనజ లక్ష్మీ, ప్రమీలారాణి, సునీత,జునైద్ పాల్గొన్నారు.

‘బీఆర్ఎస్‌కు ఓటేస్తే మోదీకి వేసినట్లే’

సనత్‌నగర్: రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ రహస్య ఒప్పందంతో పనిచేస్తున్నాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమా ఆరోపించారు. సనత్‌నగర్‌లోని అల్లావుద్దీన్‌కోఠి బస్తీలో శనివారం ఆమె పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బస్తీలో పాఠశాల, గ్రంథాలయం ఏర్పాటు, ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అమలు చేస్తామన్నారు. రోడ్లు నిర్మాణం ఒక్కటే అభివృద్ధి కాదని, అన్ని వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మైనార్టీలను విస్మరించారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అజ్జు, హాజీ, వాహిద్, హసీనా పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న కోట నీలిమా

అర్హులు ఓటు హక్కును పొందాలి



ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

లాలాపేట: భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ పొందాలని మాజీ బీజేపీ నాయకురాలు బండా కార్తీక రెడ్డి అన్నారు. తార్నాకలోని పలు పోలిగ్ బూత్‌ల వద్ద నిర్వహిస్తున్న ఓటరు నమోదును శనివారం ఆమె బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్యామ్‌సుందర్‌గౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్తీకరెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో మెరుగైన ప్రభుత్వాలను ఎన్నుకోవడానికి ఓటు అనే ఆయుధం కీలకమన్నారు. పార్టీ శ్రేణులు స్థానికంగా ఓటు లేని వారిని గుర్తించి నమోదు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీరన్న, రాము వర్మ, పోచయ్యయాదవ్, భిక్షపతి, గోవర్ధన్ గణేష్ పాల్గొన్నారు.

నిరంతర అభ్యాసంతోనే మేధోసంపత్తి



మాట్లాడుతున్న డాక్టర్ ప్రథమ్‌రాజ్ సిన్హా

సనత్‌నగర్: నిరంతర అభ్యాసం ద్వారానే మేధో సంపత్తి పెంపొందుతుందని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వ్యవస్థాపక డీన్ డాక్టర్ ప్రథమ్‌రాజ్ సిన్హా స్పష్టం చేశారు. విద్యార్థులు తమ కెరీర్‌ను ఉన్నతంగా మలచుకునేందుకు చదవడం, రాయడం, గ్రహించడం, రీజనింగ్ (రీడింగ్, రైటింగ్, రిలైజింగ్, రీజనింగ్) అనే 4ఆర్‌ల అవసరం ఎంతో ఉందన్నారు. బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం హెచ్‌పీఎస్ శతాబ్ది విద్యావేత్తల రెండో రోజు సదస్సు కొనసాగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రథమ్‌రాజ్ సిన్హా మాట్లాడుతూ.. విద్యా రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులు, సాంకేతిక విలువలతో మారుతున్న విద్యను గ్రహించాలంటే ప్రతిఒక్కరూ అభ్యాసకులుగా మారాల్సి ఉందన్నారు. ప్రస్తుత ఆన్‌లైన్ బోధనా పద్ధతుల్లో ఉపాధ్యాయులు నైపుణ్యం సంపాదించడం ముఖ్యమన్నారు. సదస్సులో డీన్ డాక్టర్ చేతన్ సింఘాయ్, స్కూల్ ఆఫ్ పబ్లిక్, లీగల్ స్టడీస్ విద్యాశాఖ డైరెక్టర్, సీఓఓ డాక్టర్ అమ్రిత ఓహ్రా, అజయ్‌సింగ్, రాహుల్ బత్రా పాల్గొని తమ ఆలోచనలను పంచుకున్నారు.

తిరుమలగిరిలో శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీలో పాల్గొన్న జీవకన్, మల్లారెడ్డి

రసూల్‌పురా: మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తిరుమలగిరి ఫాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన శాంతిర్యాలీలో నాయకులు మల్లారెడ్డి, జీవకన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవకన్ మాట్లాడుతూ.. మణిపూర్ రాష్ట్రంలో జరిగిన అల్లర్లలో ఎందరో క్రైస్తవ కుటుంబాలు రోడ్డున పడ్డారని జరిగిన దారుణాలపై బీజేపీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి తర్వాత క్రైస్తవ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

పేదల సొంతింటి కల నెరవేరింది



ఇళ్ల పట్టాలు అందజేస్తున్న మంత్రి తలసాని, లాస్య

కంటోన్మెంట్: పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని లాస్య నందిత అన్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బహదూర్‌పల్లిలో మంత్రి తలసాని చేతుల మీదుగా జరిగిన డబుల్ బెడ్రూమ్‌ల పంపిణీ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా లాస్య మాట్లాడుతూ.. సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన 200 మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేసినట్లు తెలిపారు. అన్నివర్గాల ప్రజలు సీఎం కేసీఆర్ మరోసారి గెలవాలని కోరుకుంటున్నారని బీఆర్ఎస్ తోనే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. మరోవైపు ఇళ్ల పట్టాలు అందుకున్న కంటోన్మెంట్ నియోజకవర్గ లబ్ధిదారులు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్ శ్రీనివాస్, సంతోష్, సదానంద్ గౌడ్, మురళీ యాదవ్, వంగల మల్లేష్, నరేశ్, రమేశ్ రాజ్, నర్సింహ ముదిరాజ్, సతీష్, భాస్కర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతలను నిలదీయండి

కంటోన్మెంట్: కంటోన్మెంట్ అభివృద్ధికి ఏమాత్రం సహకారం అందించని బీఆర్ఎస్ నేతలను ప్రజలు ఎక్కడికక్కడే నిలదీయాలని బోర్డు సభ్యుడు రామకృష్ణ అన్నారు. ఆరోవార్డు వాహినీ నగర్‌లో రూ.70 లక్షల బోర్డు నిధులతో చేపట్టిన బీటీరోడ్డు పనులకు శనివారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లికార్జున్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. కంటోన్మెంట్‌లో అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విడుదల చేయడం లేదన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు బీఆర్ఎస్ నేతలు ఎలాంటి నిధులు తెప్పించడం లేదన్నారు. గతంలో వాహినీ నగర్‌లో మంచినీటి సదుపాయం కల్పించేందుకు బీఆర్ఎస్ నేతలు కాలనీ వాసులు సగం ఖర్చు భరించాలని డబ్బులు వసూలు చేశారని భానుక మల్లికార్జున్ ఆరోపించారు. తాము చొరవ తీసుకుని పూర్తిగా బోర్డు నిధులతో తాగునీటి పైపులైన్ వేయించామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, వినయ్ కుమార్, రామ్మోహన్, గంగారామ్, శివరావు, సుబ్రహ్మణ్యం, దినేశ్, మోయినుద్దీన్, ఆనంద్, నర్సింగ్ రావు, కుల్‌దీప్ సింగ్, మోహన్ రాజ్‌పంత్ పాల్గొన్నారు.



బీటీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న రామకృష్ణ